విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 20, అక్టోబర్ 2023

ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు జయప్రదం చేయండి-రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేష్

విశాలాంధ్ర-డోన్ : దేశంలో మొట్టమొదటి కార్మిక సంఘం స్వాతంత్ర్య సంగ్రామంలో ఎన్నో పోరాటాలు చేసి త్యాగలకు నిలయంగా ఘనచరిత్ర కలిగిన సంఘం ఏఐటీయూసీకే దక్కుతుందని,దేశంలో కార్మికవర్గాన్ని ఒకేతాటిపైకి తీసుకొచ్చి ఎన్నో చట్టాల రూపకల్పనకు పూనుకున్న అగ్రగామి సంఘం ఏఐటీయూసీ ఈనెల 31న 104 వ వ్యవస్థాపక దినోత్సవాన్ని కార్మిక వర్గం వాడ వాడాల జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేష్ పిలుపు నిచ్చారు. గురువారం స్థానిక నక్కి రామన్న భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా జనరల్ బాడీ సమావేశం జిల్లా అధ్యక్షులు రఘురాం మూర్తి అధ్యక్షతన జరిగింది. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా ఓబులేసు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు రెండవ సారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం నాటి కాలంలో పోరాడి సాధించుకున్న అనేక కార్మిక చట్టాలను రద్దుచేసిందన్నారు.లేబర్ కోడులుగామార్చి కార్మికులను యాజమాన్యాలకు బానిసలు తయారు చేసిందన్నారు.దేశఆర్థిక సంపదను, ప్రభుత్వ రంగసంస్థలను ఆదానీ అంబానీలకు తాకట్టు పెడుతుందని ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్మి ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేస్తుందని వారు అన్నారు.మోదీ ప్రభుత్వం అవాలంబిస్తున్న కార్పొరేటీకరణకి వ్యతిరేకంగా, కార్మిక, రైతు వ్యతిరేక విధా నాలకు నిరసనగా నవంబర్ 26,27, 28 తేదీలలో విజయవాడలో రైతు, కార్మిక సం ఘాలు ఆధ్వర్యంలో ఛలో రాజ్ భవన్ పేరు తో మహాధర్నా నిర్వహిస్తున్నామని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునెప్ప మాట్లాడుతూ కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఏఐటీ యూసీ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపైన సమరశీల పోరాటాలకి కార్మికవర్గం సిద్ధం కావాలన్నారు.సీపీఐ జిల్లా కార్యదర్శి యన్. రంగనాయుడు మాట్లాడుతూ నవంబర్‌లో జరిగే ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, డిప్యుటీ కార్యదర్శి రమేష్ బాబు,ఆర్గనైజింగ్ కార్యదర్శి బాలకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మినారాయణ, సుగుణమ్మ భాస్కర్, అబ్బాస్, శ్రీనివాసులు, చంద్రకళ, జూలేక, చాందిని, తదితరులు పాల్గొన్నారు.

నేడే వాణీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

విశాలాంధ్ర – డోన్ రూరల్ : నియోజకవర్గ కేంద్రమైన డోన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వాణీమల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ముఖ్యఅతిథుల చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించనున్నట్లు హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది. దూర ప్రాంతాలకు వైద్యం కోసం వెళ్లకుండ అన్ని రకాల ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో తమ హాస్పిటల్‌లో ఉంటాయని తెలిపారు.డోన్ పరిసర గ్రామాల ప్రజలు, డోన్ వాసులు మెరుగైన వైద్యం కోసం అన్ని రకాల వైద్య నిపుణులు 24 గంటలు అందుబాటులో ఉండి, వివిధ రకాల వైద్యసేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వాణీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్థిక, కార్మిక శాఖల మంత్రులు బుగ్గన రాజేంద్ర నాథరెడ్డి,గుమ్మనూరు జయరామ్‌లు హాజరవుతున్నట్లు తెలిపారు.వాణీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు, మిత్రులు అభినందనలు తెలిపారు.

వైద్య శిబిరం విజయవంతం

విశాలాంధ్ర –ఉయ్యాలవాడ: ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతోనే ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టారని జడ్ పీ టీసీ సభ్యురాలు పుణ్య లక్ష్మి దేవి అన్నారు. గురువారం మండలంలోని కొండపల్లి సచివాలయం ఆవరణలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో జనరల్ సర్జన్ ఎండీ లీలాప్రసాద్, వైద్యాధికారులు శివ కుమార్, శివలింగమ్మ, వెంకటసుబ్బయ్య, వైద్యబృందం 506 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, సర్పంచులు లక్ష్మీ పద్మజ, ఉప సర్పంచుల వెంకటసుబ్బారెడ్డి, జగదీశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు శివమ్మలు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ వాచ్‌మెన్ మృతి

విశాలాంధ్ర- నందికొట్కూరు : స్థానిక మార్కెట్‌యార్డులో కొన్నేళ్లుగా వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న భగవాన్‌దాస్(56) అనారోగ్య కారణంతో బుధవారం రాత్రి స్వగ్రామం తాటిపాడులో మరణించారు.విషయం తెలుసుకున్న మార్కెట్ యార్ చైర్‌పర్సన్ షేక్ రాహత్ జబ్బార్, వైసీపీ సీనియర్ నాయకులు షేక్ జబ్బార్ గురువారం తాటిపాడుకు వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబం సభ్యలకు రూ.15 వేలను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ వాచ్‌మెన్ మృతి చెందిన విషయం రాష్ట్రయువజన విభాగం అధ్యక్షులు బైరెడ్డి సిద్దార్థరెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వచ్చేలా ప్రయత్నం చేస్తానని ఆయన మాట ఇవ్వడం జరిగిందన్నారు. వారివెంట మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ జలీల్ అహ్మద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాదా సీదాగా సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర – రుద్రవరం : మండల కేంద్రం లోని ప్రజాపరిషత్ సమావేశ భవనంలో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశం ప్రశ్నోత్తరాలు లేకుండా సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పలువురు అధికారులు వారి వారి అభివృద్ధి పనుల నివేదికలను చదివి వినిపించారు. ఈ సమావేశానికి ఆయా శాఖలకు చెందిన అధికారులు, ప్రజా ప్రతినిధులు గైర్హాజరు కావడంతో సమావేశ భవనంలో సగం కుర్చీలు ఖాళీగా అధికారులకు దర్శనమిచ్చాయి.

నెరవేరిన సాకారం

విశాలాంధ్ర- నందికొట్కూరు : ఆత్మకూరు రోడ్డు సమీపంలోని జమ్మిచెట్టు దగ్గర కొన్నేళ్లుగా విద్యుత్తు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బంది పడటం జరుగుతుండేదని, అయితే ఈ సమస్యకు స్పందించిన మున్సిపల్ ఛైర్మన్ సుధాకర్ రెడ్డి గురువారం మున్సిపల్ విద్యుత్ అధికారులతో మాట్లాడి విద్యుత్ సౌకర్యంతో పాటు వీధిలైట్లు వేయించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ స్వయంగా చొరవ తీసుకొని జమ్మిచెట్టు దగ్గర స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నందుకు దసరా ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ఉత్సవ సమితి సభ్యులు శ్రీకాంత్, ఆర్ట్ శీను, మురళి, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సురక్ష శిబిరాల్లో మెరుగైన వైద్య సేవలు

విశాలాంధ్ర – నంద్యాల : ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక హరిజనవాడ అర్బన్ సెంటంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని కమిషనర్ తనఖీ చేశారు. ఈసందర్భంగా కమిషనర్ రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజారోగ్య సమస్యలకు ఆరోగ్య సురక్ష శిబిరాలు అండగా నిలుస్తున్నాయన్నారు. ప్రజలందరికీ ఉచితంగా పలు రకాల పరీక్షలు చేసి, ఉచితంగా తగిన మందులు ఇవ్వటం జరిగిందన్నారు. కమిషనర్ వెంట మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాస్, శానిటేషన్ సూపరైజర్ శివప్రసాద్ రెడ్డి, హెల్త్ సెక్రటరీలు సూర్య నారాయణమ్మ. పద్మావతి, తదితరులున్నారు.

ఛలో గుంటూరు సింహగర్జన జయప్రదం చేయండి

విశాలాంధ్ర – మిడుతూరు : రాజ్యాధికారంలో కొన్ని దశాబ్దాలుగా అన్ని రాజకీయ పార్టీలు మా దూదేకుల జాతిని విస్మరిం చడం చాలా అన్యాయమని దూదేకుల హక్కుల పోరాట సమితి నాయకులు దూదేకుల ఖాజా వలి ఆవేదన వ్యక్తం చేశారు. 20 లక్షల పైచిలుకున్న దూదేకుల నూర్ భాషలకు గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ప్రభుత్వాలు ఏస్థాయిలో కూడా సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆరోపించారు. అనంతరం చట్టసభల్లో దూదేకుల నూర్ భాషాలకు అవకాశం కల్పించాలని కోరుతూ ఈ నెల 29వ తేదీన గుంటూరులో జరిగే సింహ గర్జన గోడ పత్రికను విడుదల చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలకు సరైన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ముర్తుజావలి, చాంద్ బాషా, మౌలాలి,మా భాష, కాసిం, మన్సూర్,హుస్సేన్ సాహెబ్‌లు పేర్కొన్నారు.

Name of Change

I GANI SALMA BEGAM (old name) W/o ILIYAZ ALI SYED, Flat No. 503, Vars Splendid Apartment, Old Madras Road, B. Narayanapura, BENGALURU - 560016, BENGALURU Dist. Karnataka hereby state that I have changed my name GANI SALMA BEGAM (old name) TO GANI SALWA BEGUM in (new name) and known as GANI SALWA BEGUM.

భీమా తక్షణ సాయం పంపిణి

విశాలాంధ్ర -చాగలమర్రి : ముత్యాలపాడు-2 సచివాలయ పరిధిలోని తోడేండ్లపల్లె ఎస్సీ కాలనీకి చెందిన చల్లా ఏసోబ్ (45) ఈ నెల 18న అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ భీమా తక్షణ సాయం కింద మృతుడి భార్య మార్తమ్మ కు రూ.10వేలు సర్పంచ్ గోవిందయ్య, ఎంపీడీవో మహబూబ్ దౌలాలు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ భీమా చేసిన వారు సహజంగా మృతి చెందితే రూ.లక్ష ప్రభుత్వం అందజేస్తుందన్నారు. మిగతా మొత్తం ప్రభుత్వం వారి ఖాతాలో జమ చేస్తుందన్నారు.

విశాఖ - కడప తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను నంద్యాల వరకూ పొడిగించాలి

విశాలాంధ్ర- కోవెలకుంట్ల : ప్రస్తుతం విశాఖ పట్నం నుండి కడప వరకూ నడుపుతున్న తిరుమల ఎక్స్ ప్రెస్ రైలును నంద్యాల వరకూ పొడిగించాలని రాయల సీమ జాయింట్ యాక్షన్ కమిటీ కో-ఆర్డినేటర్ కామని వేణుగోపాల్ రెడ్డి దక్షిణ మధ్య రైల్వే జీఎంను కోరారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ విశాఖ రైలు కడపకు ఉదయం 7గం.కు వచ్చి సాయింత్రం 5.45కు తిరిగి విశాఖకు బయలు దేరి వెళుతుందన్నారు. ఈ మధ్యలో 8 నుంచి 10 గంటలు పాటు సమయం వృధా అవుతుందని, ఈ సమయాన్ని నంద్యాల వరకూ పొడిగించడం ద్వారా కడప -నంద్యాల వరకున్న గ్రామాల ప్రజలకు ప్రయాణ వసతి పెరుగుతుందన్నారు.నంద్యాల-కడప వరకున్న ప్రజలకు కొత్తగా ఏర్పాటు అవుతున్న రాజధాని విశాఖ పట్టణానికి నేరుగా రైలులో వెళ్లి రావడానికి అనుకూలంగా ఉంటుందని సూచించారు. అలాగే నంద్యాల – ప్రొద్దుటూరు మధ్య గ్రామాల్లోని ప్రజలు ఎర్రగుంట్లలో ఇటు చెన్నై,ముంబాయి వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లడానికి సైతం ఎర్రగుంట్ల నుండి వసతి కూడా అందుబాటులోకి వస్తుందని వేణుగోపాల్ రెడ్డి అన్నారు. ప్రయాణీకులకు ఇన్ని ప్రయాణ వసతులు కల్పించడం ద్వారా రైల్వే శాఖకు మరింత ఆదాయం సమకూరనుందని వేణుగోపాల్ రెడ్డి రైల్వే శాఖ అధికారి జి.ఎంకి విన్నవించుకున్నారు. ఆయన ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ విశాఖ – కడప రైలును నంద్యాల వరకూ పొడిగించే వరకూ కలిసి అందరం పోరాడి సాధించుకుందామని వేణుగోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు.

ప్రచార అర్భాటాలు తప్పా.. ప్రజా సమస్యలు పట్టని సీఎం జగన్

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి
రైతుల బ్యాంకు రుణాలను మాఫీ చేయాలి
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్

అధికారపార్టీ వైసీపీకి ప్రచార అర్భాటాలు తప్పా.. రైతులు, రాష్ట్ర ప్రజలు తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా కరువు కాటకాలు..సమస్యలతో సతమత మవుతుంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వాటిని పరిష్కరించకుండ పెడచెవిన పెడు తున్నారనీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతనెల జిల్లా లోని 106 చెరువులకు సాగు, తాగునీటి అవసరాల కోసం నీరు నింపే కార్యక్రమానికి హాజరయ్యారు. తూ తూ మంత్రంగా చేపట్టడంతోనే తాగునీటి సమస్య ఉత్పన్నమయ్యే ప్రమాద ముందన్నారు. అలాగే ఖరీఫ్‌లో వంటలు సాగుచేసి నష్టపోయిన రైతులకు బ్యాంకుల్లో రుణమాఫీ, ఎకరానికి రూ.30 వేల సాయం అందించి ప్రభుత్వం ఆదు కోవాలని కోరారు. లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఉద్యమాలు చేపడతా మనీ రామకృష్ణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

విశాలాంధ్ర – ప్యాపిలి : సకాలంలో వర్షాలు లేక ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ప్రభుత్వం తక్షణమే పంటలు నష్టపోయిన రైతులకు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు మాఫీ చేసి రైతులను ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండిపోయిన వంటపొలాలను రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రామచంద్రయ్య, జగదీష్, జిల్లా కార్యదర్శి రంగనాయుడులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'జగన్మోహన్‌రెడ్డి హయాంలో రైతుల పరిస్థితి అయోమయ పరిస్థితిలో ఉన్నారని, రాష్ట్రంలో కరువు ఏర్పడినప్పటికీ, ప్రభుత్వం నుంచి ఎలాంటి చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వ్యవసాయ కూలీలు వలసబాట పట్టి ఇతర రాష్ట్రాలకి పోతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. సీఎం జగన్ ఎమ్మిగనూరు బహిరంగ సభలో రైతులను ఆదుకుంటారని హామీ ఇస్తారని ఆశించి నప్పటికీ సీఎం రైతుల గురించి మాట్లాడకపోవడం రైతుల పట్ల తన వైఖరి ఏవిధంగా ఉందో అర్థమవుతుందని విమర్శించారు.డోన్ నియోజకవర్గంలో 106 చెరువులకు నీళ్లు నింపకుండా కేవలం ప్రారంభోత్సవ ప్రచారానికే పరిమితమైందని ఎద్దేవా చేశారు. గ్రామాల్లోని ప్రజలకు తాగు నీటి సమస్య జఠిలంగా మారే ప్రమాదముందని హెచ్చరించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు జిల్లాలో పరిశ్రమ ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లేనిపక్షంలో ప్రజలు పాలకులకు తగిన బుద్ధి చెబుతారని గుర్తు చేశారు. ఖరీఫ్‌లో సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు నష్టపరిహారం రూ.30 వేలు ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు, ప్రజల సమస్యలు పరిష్కరించకపోతే సీపీఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

నాయకుల వెంట జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, రాముడు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కారుమంచి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్య ప్రతాప్, జిల్లా కోశాధికారి సురేష్, మండల కార్యదర్శి వెంకటేష్, జిల్లాసమితి సభ్యులు పులి శేఖర్, జిల్లా నాయకుడు రంగస్వామి యాదవ్, ఏఐఎస్ఎఫ్ సహాయ కార్యదర్శి శివ కేశవులు, మనోజ్, శశిధర్‌రెడ్డి, బంగారప్ప, ఈశ్వర్, వంశి, వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గాజాలో మారణ హోమంపై ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకోవాలి

విశాలాంధ్ర-డోన్ : ఇజ్రాయిల్-హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని అపి, ప్రజలు కాపాడాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జి.ఓబులేషులు కోరారు. గురువారం డోన్‌లోని సీపీఐ సర్కిల్లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి ప్రజలను కాపాడాలంటూ ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇజ్రాయిల్-హమాస్ మధ్య యుద్ధం 12 రోజులుగా కొనసాగుతుందన్నారు.ఇప్పటికే దాదాపు 5వేల మంది ప్రజలు మృతి చెందారన్నారు. గాజా శవాల దిబ్బగా మారి ప్రజలు తిండి కోసం నానా తిప్పలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హమాస్‌ను అంతం చేసే వరకు యుద్ధం ఆగదని ఇజ్రాయిల్ ప్రకటించడం సరికాదన్నారు. గాజ నగరంలో ఆసుపత్రి పై వైమానికా దాడులు చేయడం సరికాదన్నారు. తక్షణమే ఐక్య రాజ్యసమితి జోక్యం చేసుకొని యుద్ధాన్ని ఆపాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష్య, కార్యదర్శులు రఘురామ్మూర్తి, పి.సుంకయ్య జిల్లా నాయకులు లక్ష్మీ నారాయణ, రమేష్,వ్య.కా.స.జిల్లా కార్యదర్శి కె.రాధాకృష్ణ, నాయకులు అబ్బాస్, జులేఖ, అన్వర్, వెంకటేష్‌గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలనపై ప్రజల హర్షం - ఎమ్మెల్యే శిల్పా

విశాలాంధ్ర – నంద్యాల : అధికారపార్టీ వైసీపీ ప్రభుత్వ పాలన పై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారనీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని 34 వార్డు వీసీ కాలనీలో గురువారం వార్డు ఇన్‌చార్జ్ జాకీర్‌హుస్సేన్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా పాల్గొని గడప గడప తిరుగుతూ లబ్ధిదారులతో మమేకమై ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు వివరిస్తూ సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శిల్ప మాట్లాడుతూ సీఎం జగన్ ఆదేశాల మేరకు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈకార్యక్రమానికి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో కష్టాలు తీరిన ఆనందం ప్రజల్లో కనిపిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణబోర్డు విశాఖకు తరలిస్తే సహించం

విశాలాంధ్ర – చాగలమర్రి : కృష్ణబోర్డు విశాఖకు తరలిస్తే సహించమనీ, రాష్ట్రంలో అధికారపార్టీ వైసీపీ ప్రజాప్రతినిధులు కమిషన్ల కోసమే పని చేస్తున్నారని మాజీమంత్రి భూమా అఖిలప్రియ ఆరోపించారు. గురువారం పెద్దవంగలిలో 'బాబుకు తోడుగా మేము సైతం'లో కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా హజరత్ దస్తగిరి స్వామికి చంద్రబాబు ఆరోగ్యంగా సురక్షితంగా బయటకొచ్చి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రత్యేక పాతేహాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో రచ్చబండ కార్యక్రమం ఆమె నిర్వహించారు. కృష్ణబోర్డు నీటి యాజమాన్యాన్ని విశాఖపట్నం తరలిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈబోర్డును తరలిస్తే ముఖ్యమంత్రి ఇంటి వద్ద ధర్నా చేసేందుకు కూడా వెనుకాడమన్నారు. కృష్ణానీటిని అధికభాగం తెలంగాణకు కేటాయించాలని చూస్తున్న రాష్ట్రంలోని ప్రజాప్రతినిధులు, మంత్రులు ఎవ్వరూ కూడా మెదపక పోవడం సిగ్గుచేటన్నారు. ఇదే జరిగితే రాయలసీమ రైతులు ఊర్లు వదిలేసి ఇతర ప్రాంతాలకు వలస పోవాల్సిందేనన్నారు.దిగువకు వందల క్యూసెక్కులు నీటిని తరలిస్తున్నప్పటికీ జిల్లా ప్రతి ప్రజాప్రతి నిధులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు.రాష్ట్రంలో అత్యధికశాతం రైతులు ఆత్మహత్యలు చేసుకునేది పులివెందుల ప్రాంతంలోనే అన్నారు. బ్రిటిష్ పాలనను తలదన్నేలా రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందన్నారు. ఈపాలనను బట్టి చూస్తే మళ్లీ బ్రిటిష్ ప్రభుత్వం వచ్చేలాగా ఉందన్నారు. ఈ పాలనకు చరమగీతం పాడక పోతే రైతులు, నిరుద్యోగులు, ప్రజలు ఇబ్బంది తప్పదన్నారు. ఇకనైనా రైతులు ప్రజలు ఈ దుష్టపాలను గమనించి 2024 ఎన్నికల్లో టీడిపికి పట్టం కడితే అందరూసుఖసంతోషాలతో ఉంటారన్నారు. చంద్రబాబును అరెస్టు చేసి దానికోసం వ్యతిరేకిస్తూ నిరసనలు ధర్నాలు శాంతియుతంగా చేస్తున్న పార్టీ నాయకులపై సైతం అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేయడం చూస్తుంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనన్నారు. రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌భాష, తదితరులు పాల్గొన్నారు.

స్కందమాతలంకారంలో భ్రమరాంబాదేవి
శేషవాహనంపై శివపార్వతులు

విశాలాంధ్ర- శ్రీశైలం: శ్రీశైల మహా క్షేత్రంలో దసరా మహోత్సవాల్లో భాగంగా 5 వ రోజు గురువారం శ్రీ భ్రమ రాంబదేవి స్కందమాత అలంకారంలో శివపార్వతులు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్స వాల్లో భాగంగా స్వామి అమ్మ వారి యాగశాలలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంకాల ప్రత్యేక పూజలనంతరం అక్కమహాదేవి అలంకరణ మండ పంలో స్వామి అమ్మవారాల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అలంకరణలు, అమ్మవారికి స్కందమాత అలంకారం పూలతో నూతన వస్త్రాలతో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించి అలంకరణ పూజలను అర్చక వేద పండితులు సాంప్రదాయ బద్దంగా నిర్వహించారు. కార్యక్రమంలో కార్య నిర్వహణ అధికారి డి.పెద్దిరాజు దంపతులు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చక వేద పండి దూదేకుల హక్కుల పోరాట సమితి నాయకులు దూదేకుల ఖాజావాలి

జగనన్న చేదోడు లబ్ధిదారులకు నేరుగా జమ

విశాలాంధ్ర – నంద్యాల : జగనన్న చేదోడు పథకం కింద జిల్లాలో 14,304 మంది అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో రూ.14.34 కోట్లు గురువారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నుండి ముఖ్యమంత్రి జగన్ బటన్‌నొక్కి జమ చేశారని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ పేర్కొన్నారు.కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జగనన్న చేదోడు పథకం కింద చెక్కును కలెక్టర్, బెస్త సంక్షేమ సంఘ డైరెక్టర్, రజక సంఘ డైరెక్టర్ లబ్ధిదారులకు అందజేశారు.

కొత్తపేటలో అభివృద్ధి పనులు ప్రారంభం

విశాలాంధ్ర – బనగానపల్లె : మండల పరిధిలోని ఇల్లూరు కొత్తపేటలో పలు అభివృద్ధి ప నులను గురువారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. రూ.40.30 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతుభరోసా, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవన కేంద్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. వైయస్సార్ యంత్రసేవ పథ కం ద్వారా రైతుసంఘాలకు ప్రభుత్వ రాయితీపై ట్రాక్టర్లను అందజేశారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరైన బీసీ

విశాలాంధ్ర -కోవెలకుంట్ల : మండల కేంద్రమైన కోవెలకుంట్ల ఆర్యవైశ్యల సమక్షంలో అమ్మవారిశాలలో దేవి శరన్న వరాత్రులు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి హాజ రయ్యారు. స్థానిక అమ్మవారిశాలలో ఏర్పాటు చేసిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బీసీ, కాత్రేడ్డి మల్లికార్జునరెడ్డి, టంగుటూరి శ్రీనయ్యలు వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం,గాయత్రీదేవి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని ఆర్యవైశ్యులందరూ ఐక్యంగా ఉండి వ్యాపార పరంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం చంద్రబాబు త్వరగా జైలు నుండి విడుదల కావాలని ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, యువనాయకుడు అభిలాష్, సుబ్బారాయుడు గుప్త,మాన్యం నందయ్య, తదితరులు పాల్గొన్నారు.

పండగలకు వెళితే..సమాచారం ఇవ్వాలి

విశాలాంధ్ర- జూపాడుబంగ్లా : దసరా పండుగ సెలవులకు స్వంత గ్రామాలకు వెళ్లే ముందు పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని, ముందుగా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఎస్సై మారుతిశంకర్ తెలిపారు. గురువారం పోలీసు స్టేషన్‌లో ఎస్సై విలేకరులతో పండుగకు సొంత గ్రామాలు, విహార యాత్రలకు వెళ్లే ప్రజలు ఇంటిలోని విలువైన వస్తువులు బంగారం, వెండి, ఆభరణాలు, డబ్బులు మీ వెంట తీసుకొని వెళ్లడం లేదా బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని హెచ్చరించారు. పండుగలకు వెళ్లే వారు సమాచారం ఇస్తే దొంగతనాలు జరగకుండా ప్రత్యేకనిఘ ఏర్పాటు చేస్తామని ఎస్సై తెలిపారు. ఎవరైనా అనుమానితులను గుర్తిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు ఎస్సై సూచించారు.

దళితుల సమస్యలపై సీఎంతో చర్చించిన చంద్రమౌళి

విశాలాంధ్ర – నందికొట్కూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎమ్మిగనూరు పర్యటన నిమిత్తం గురువారం ఓర్వకల్లు విమా నాశ్రయంలో నందికొట్కూరు నియోజకవర్గ సీనియర్ వైసీపీ యువ నాయకులు ఎక్కల దేవి చంద్రమౌళి ముఖ్యమంత్రికి పుష్ప గుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన బుడగ జంగాలను ఎస్సీల జాబితాలో చేరిస్తే ఎస్సీలకు పూర్తిగా అన్యాయం జరుగుతుందని ఎట్టి పరిస్థితుల్లో ఎస్సీలకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. అలాగే నందికొట్కూరు నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, తాజా రాజకీయ పరిస్థితులను సీఎం దృష్టికి తీసుకెళ్లి చర్చించడం జరిగిందని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర- ఉయ్యాలవాడ: మండలంలోని రూపనగుడి గ్రామ సమీపంలో కుందూనది వంతెన మలుపు వద్ద గురువారం ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు కింద వడటంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కోవెలకుంట్లకు చెందిన తెలుగు రమణయ్య పెద్దముడియం మండలం పాలూరు గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళుతున్న సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. కాలు, తొడ భాగాలు, తలకు తీవ్రరక్త గాయా లయ్యాయి. రూపనగుడి సర్పంచ్ సోమశేఖర్‌రెడ్డి 108 వాహనానికి ఫోన్ చేయగా, సిబ్బంది అక్కడికి చేరుకొని క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స నిమిత్తం కోవెలకుంట ఆసుపత్రికి తరలించారు.

పిడికెడు బియ్యం కార్యక్రమం ప్రారంభం

విశాలాంధ్ర- నందికొట్కూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం పిడికెడు బియ్యం కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీత ప్రారంభించారు. సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు బియ్యం మరియు నగదును జంతుశాస్త్ర అధ్యాపకులు రామకృష్ణయ్యకు అందజేశారు.అనంతరం సేకరించిన 60 కిలోల బియ్యం, రూ.2,600ల నగదుతో నిత్యవసర సరుకులు కొనుగోలు చేశారు. వాటిని స్థానిక నిరాశ్రయుల ఆశ్రమంలో అందజేశారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా. సునీత మాట్లాడుతూ అనాథలు, వృద్ధులకు సేవ చేసినట్లయితే దేవుని ఆశీస్సులు పొందవచ్చని తెలిపారు.

కార్యకర్తను పరామర్శించిన -బీసీ

విశాలాంధ్ర – బనగానపల్లె : మండల పరిధిలోని కాపులపల్లె గ్రామానికి చెందిన యడమకంటి పెద్దిరెడ్డి అనారోగ్యంతో బాధ పడుతూ హాస్పిటల్లో చికిత్స పొందారు. ఆయన ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటుండగా ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి గురువారం వారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి, వారి ఆరోగ్య క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. బీసీవెంట సర్పంచ్ తులసిరెడ్డి, మురళీమోహన్ రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర – పాములపాడు : మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర ఇవ్వాలని ఏపీ రైతు,కౌలురైతు సంఘాల మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, సోమన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులతో కలిసి గురువారం మొక్కజొన్న ధాన్యాన్ని పరిశీలించారు.

కరువు బారి నుండి రైతులను ఆదుకోవాలి

ఎండిపోయిన వేరుశనగ పంటను పరిశీలిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర - పత్తికొండ : కరువు బారి నుండి రైతులను ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం కర్నూలు జిల్లా పత్తికొండ మండలం చిన్నహుల్తి జూటూరు గ్రామాల మధ్యలో ఎండిపోయిన వేరుశనగ పంటను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రామచంద్రయ్య, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ పరిశీలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది సరైన వర్షాలు లేక రైతులు సాగుచేసిన పంటలన్నీ ఎండిపోయి తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. పంట పెట్టుబడికి రైతులు అధిక వడ్డీలకు అప్పులు తీసుకొచ్చి పెట్టుబడులు పెట్టారని, కనీసం పంట పెట్టుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా తీవ్ర కరువు దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడితే ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదన్నారు. సీఎం జగన్ కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పర్యటనలో జిల్లా కరువు పరిస్థితులపై మాట్లాడకపోవడం దురదృష్టకరమన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో కరువు పరిస్థితులను అంచనా వేసి తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కరువు బారి నుండి రైతులను ఆదుకునేంతవరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీలు, రైతు సంఘాలతో కలిసి రైతులకు న్యాయం జరిగేంత వరకు సిపిఐ అండగా ఉంటుందన్నారు.ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రామచంద్రయ్య, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్‌లు మాట్లాడుతూ కరువు వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు 40,000ఇవ్వాలని డిమాండ్ చేశారు.రైతులు పంట పెట్టుబడికి బ్యాంకుల్లో తీసుకున్న అన్ని రకాల రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి సాగు, తాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబి రసూల్, పత్తికొండ, తుగ్గలి, డోన్ సిపిఐ మండల కార్యదర్శులు డి.రాజా సాహెబ్ సుల్తాన్, పులి శేఖర్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, సిపిఐ ప్రజాసంఘాల నాయకులు కారుమంచి, తిమ్మయ్య,మోటరాముడు,గురుదాస్, కారన్న,పెద్ద ఈరన్న, రంగన్న,శ్రీనివాసులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు దుర్మార్గం...బి.గిడ్డయ్య

విశాలాంధ్ర- కర్నూలు : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఎమ్మిగనూరు పర్యటన సందర్భంగా సీపీఐ ప్రజాసంఘాల నాయకులను పోలీసులు అరెస్టుచేయడం దుర్మార్గమని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఒక ప్రకటనలో ఖండించారు. గురువారం సీఎం ఎమ్మిగనూరు వస్తుండటంతో కర్నూలు జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని,కరువు సహాయం చేపట్టాలని, జిల్లా అభివృద్ధికి 10 వేల కోట్లు నిధులు కేటాయించాలని, జిల్లాలో పశ్చిమ ప్రాంతంలో పెండింగ్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు ఆర్డీఎస్ కుడికాలువ,వేదవతి,గుండ్రేవుల రిజర్వాయర్‌లకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని,పనులు పూర్తి చేసి కరువు కాటకాల్లో కూరుకుపోయిన పశ్చిమ ప్రాంతానికి లక్షలాది ఎకరాలకు సాగునీరు, త్రాగునీరు ఈ ప్రాంత ప్రజలకు అందించాలని, కరువును పారదోలాలని కోరుతూ వినతిపత్రం ఇవ్వడానికి కూడా అవకాశం ఇవ్వకుండా ఎమ్మిగనూరులో పోలీసులు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్నగౌడ్,జీ.రంగన్న, మండల కార్యదర్శి చిన్నన్న, తిమ్మగురుడు,ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సాబీర్ భాష, దస్తగిరి వీరితో పాటు 15 మందిని, మరియు కోడుమూరులో సిపిఐ నాయకులు కృష్ణ,రాజు,లను పెద్దకడబూరు మండల కార్యదర్శి వీరేశ్ ను పోలీసులు ముందస్తు అరెస్టులుచేసి పోలీస్ స్టేషన్లో అక్రమంగా నిర్బంధించడం దుర్మార్గమన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రికి వినతి పత్రం సమర్పించడం కూడా నేరమా అని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ రెడ్డి జిల్లాలో ఎక్కడ పర్యటించిన వామపక్ష పార్టీల నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం, నిర్బంధించడం పరిపాటిగా మారిందని,ప్రభుత్వం నియంతృత్వ పద్ధతులను అవలంబిస్తూ, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ,చట్టాల ఉల్లంఘనకు పాల్పడుతున్నదని అక్రమ అరెస్టులను ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, అందరూ ఖండించాలని ఆయన కోరారు.

హనుమప్ప మృతికి సీపీఐ జిల్లా సమితి సంతాపం

విశాలాంధ్ర - కర్నూలు : మద్దికేర మండల సీపీఐ నాయకులు హనుమప్ప అనారోగ్యంతో మృతి చెందడం చాలా బాధాకరం, పార్టీకి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. హనుమప్ప మద్దికేర మండల సీపీఐ కార్యదర్శిగా,కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులుగా పనిచేశారని,పత్తికొండ నియోజకవర్గంలో, మద్దికేర మండలంలో పేద ప్రజల పక్షాన జరిగిన అనేకపోరాటాల్లో పాల్గొన్నాడని, ప్రముఖ పాత్ర వహించాడని, మరణించేంతవరకు ఎంతో చురుకుగా ఉన్న హనుమప్ప ఈరోజు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని సీపీఐ తీరని లోటని వారి మృతికి పార్టీ జిల్లా సమితి తరపున ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు బి.గిడ్డయ్య ,ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె జగన్నాధం,సీపీఐ నగర కార్యదర్శి పీ రామకృష్ణారెడ్డిలు తెలిపారు.

వాన రాకపోయే.. పంటలు ఎండిపోయే

విశాలాంధ్ర - చిప్పగిరి : ఖరీఫ్ సీజన్ లో చిప్పగిరి మండల రైతులు ఎక్కువగా పంటలు సాగు చేస్తారు. అయితే పంటలు సాగు చేసిన అనంతరం సరైన సమయంలో వాన రాక సాగు చేసిన పంటలు పూర్తిగా ఎండిపోయే స్థితికి చేరాయని మండల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన చిప్పగిరి తో పాటు మండల పరిధిలోని రామదుర్గం, నగర డోన,నేమకల్లు, బెల్దోన, నంచర్ల, దౌల్తాపురం గ్రామాలలోని ఎర్రనేలలో వేరుశనగ పంటను ఎక్కువగా సాగు చేయడం జరుగుతుంది. ప్రతి ఏటా మాదిరే ఈ సంవత్సరం కూడా ఖరీఫ్ సీజన్ లో వేరుశనగ పంటను సాగు చేయడం జరిగింది. అయితే సరైన సమయంలో వర్షాల కురువకపోవడంతో సాగు చేసిన పంటలు పూర్తిగా ఎండ ముఖం పట్టాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిస్తే తప్ప సాగు చేసిన వేరుశనగ పంట చేత కొంతదని ఇలా అయితే అప్పులు తీరేది ఎలా అంటూ రైతులు వర్షం కోసం ఆకాశం వైపు చూడాల్సిన దుస్థితి ఏర్పడిందని మండల రైతులు వాపోతున్నారు. ఎటు చూసినా రైతులకు ప్రత్యామ్నాయం కనపడటం లేదని వర్షం వస్తే తప్ప రైతు జీవితాలు బాగుపడువని రైతులు అంటున్నారు.

ఆక్రందన దీక్షలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : ఈనెల 20,21 తేదీలలో ఎస్టీయు ఉపాధ్యాయ సంఘం జిల్లా కేంద్రంలో తలపెట్టిన నిరవధిక నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని గురువారం ఎస్టియు డివిజన్ స్థాయి సమావేశం మండల అధ్యక్షులు సుంకన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎస్టియు రాష్ట్ర కౌన్సిలర్ నరసింహులు, రాష్ట్ర పురపాలక కమిటీ సభ్యులు రమేష్ నాయుడు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో వేలాది మంది ఉపాధ్యాయులు,ఉద్యోగుల ఆర్థిక బకాయిలు,అర్జిత సేవలు,ఏపీజీఎల్ఐ బకాయిలు,డిఏ బకాయిలు, 11వ పిఆర్సి బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.సమావేశ అనంతరం వాల్ పోస్టర్లను విడుదల చేశారు.సమావేశంలో సీనియర్ ఉపాధ్యాయులు గోపాల్, రామ్మోహన్ రెడ్డి,దాసన్న, ఈరప్ప,వెంకటేష్,సుధాకర్ బాబు,చిరంజీవి,షేక్షావలి, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

శవానికి పోస్టుమార్టం చేసిన కేరళ పోలీసులు

విశాలాంధ్ర- హొళగుంద : హొళగుంద పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లార్తిలో గజేంద్ర(38) అనే యువకుడు గత పది నెలల క్రితం అయ్యప్ప మాలధారణతో అయ్యప్ప స్వామి దర్శనం కోసం మిత్రులతో బయలుదేరాడు .అయితే కేరళ రాష్ట్రంలోని ఒడిసెరా పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారంటూ మిత్రులు ఇచ్చిన సమాచారంతో భార్య బంధువులు కేరళ రాష్ట్రంలోని ఆసుపత్రిలో చూపించకుండా బళ్ళారి ఆసుపత్రిలో చూపిస్తామంటూ తీసుకువస్తుండగా మార్గమధ్యంలో మరణించినట్లు పోలీసులు తెలిపారు.మృతుడు గజేంద్ర భార్య ఎస్ కే.సంధ్య భర్త మృతి అనుమానంగా ఉన్నదని భర్తను హత్య చేశారంటూ కేరళ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదించినందుకు గురువారం కేరళ సీఐ రాజీవ్ కుమార్,తాహసీల్దార్ హుస్సేన్ సాబ్,హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీ రామ్ నాయక్,కానిస్టేబుల్ గురు ప్రసాద్ ఆధ్వర్యంలో కర్నూలు ఆసుపత్రి వైద్యులు శవానికి పోస్ట్ మార్టం నిర్వహించారు.10 నెలల క్రితం పూడ్చి వేసిన శవాన్ని పోస్టుమార్టం చేసి శవ పంచనామం నిర్వహించి శవాన్ని పూడ్చినట్లు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీ రామ్ నాయక్ తెలిపారు.కేరళ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వంతెన ఏర్పాటు పై హర్షం

విశాలాంధ్ర - దేవనకొండ : తెర్నెకల్ గ్రామ సమీపంలోని హంద్రీనదిపై సమ వంతెన (హై లెవల్) రూ.47 కోట్లతో నిర్మాణం చేస్తామని సిఎం హామీపై ఆ సర్పంచ్ మొగతల్ అరుణ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.ఎమ్మిగనూరులో జగనన్న చేయూత కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి అభ్యర్థన మేరకు వంతెన నిర్మాణం చేస్తామని సిఎం హామీ ఇవ్వడం వల్ల రెండు నియోజకవర్గాల ప్రజలకు రాకపోకలు ఇబ్బందులు ఉండవన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వంతెన నిర్మాణం కోసం కృషి చేసిన ఎమ్మెల్యే కి ధన్యవాదములు తెలిపారు.

కరువు జిల్లాగా ప్రకటించాల్సిందే..

విశాలాంధ్ర - హొళగుంద : హొళగుంద మండల కేంద్రం నందు స్థానిక బస్టాండ్ లో గురువారం కర్నూలు జిల్లాలో కరువు జిల్లాగా ప్రకటించాలని. సిపిఐ పార్టీ నాయకులు డిమాండ్ చేస్తూ కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మారెప్ప , సిపిఐ మండల సహాయ కార్యదర్శి రంగన్న ,రైతు సంఘం నాయకుడు కృష్ణ, సిపిఐ ఏఐటియుసి నాయకులు భాష ,గాది లింగ, జయరాం రెడ్డి,వెంకటేష్ ,శాష పాల్గొన్నారు.

సీ.ఎం సభ ప్రాంగణ ముట్టడికి యత్నం విద్యార్థి సంఘాల నేతలు అరెస్టు

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు : జిల్లాలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎమ్మిగనూరు జగనన్న చేదోడు కార్యక్రమం పర్యటన సందర్భంగా సభా ప్రాంగణాన్ని విద్యార్థి సంఘాల నేతలు ముట్టడించారు.దీంతో పోలీసులకు విద్యార్థి సంఘాల నాయకుల మధ్య తోపులాట జరిగింది, విద్యార్థి సంఘాల నాయకులు సభా ప్రాంగణంలో బైటాయించి నిరసన తెలియచేయడంతో పోలీసులు వారిని అరెస్టు చేసి టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అంతకు ముందు ఏ.ఐ.ఎస్.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షబీర్ భాష పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ,జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగరాజు,, పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు అఖండ,బి.డి.ఎస్.ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రమేష్ , ఏఐఎస్ఎఫ్ నాయకులు థామస్, వీరేష్, దస్తగిరిలు సీఎం సభాప్రాంగణంకు వెళ్ళి వినతిపత్రం ఇవ్వాలని పోతుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లాని కరువు జిల్లా గా ప్రకటించి కరువు ప్రాంత విద్యార్థులకు అన్ని రకాల ఫీజులను రద్దు చేసి,కరువు స్కాలర్ షిప్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా జిల్లాలో ఉన్నటువంటి రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధి కొరకు వంద కోట్లు నిధులు కేటాయించాలని ,జిల్లాలో ఉన్నటువంటి సాంఘిక ,సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు.ఎమ్మిగనూరు లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేసి అన్ని రంగాల కోర్సులను ప్రవేశపెట్టాలని కోరారు.క్లస్టర్ యూనివర్సిటీ కట్టడాల్లో కోట్ల రూపాయలు దోచుకున్నట్టువంటి ప్రజాప్రతినిధులు పై విచారణ జరిపించి ,అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అదే విధంగా ఆదోనిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనాలు నిర్మించి ,పూర్తి స్థాయిలో ఫ్యాకల్టీ నియమించాలని తెలిపారు.పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ అండ్ కాస్మొటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు.ప్రతి మండలానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయలని కోరారు.అలాగే నూతన జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ పాఠశాల విలీనం పేరుతో గ్రామీణ విద్యార్థులకు ప్రాథమిక విద్యను దూరం చేసారని అన్నారు.మెడికల్ విద్యార్థులకు శాపంగా మారిన జి.ఓ 107,108 రద్దు చేయలాని డిమాండ్ చేశారు.జీఓ 77 తీసుకువచ్చి పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు పి.జి.విద్యను దూరం చేశారని ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అనాలోచిత నిర్ణయాలు వలన విద్యావ్యవస్థ ను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. కావున రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం

విశాలాంధ్ర -ఆదోని రూరల్ : దేశంలో ప్రజా వ్యతిరేక నియంత పాలన సాగిస్తున్న బిజెపి ప్రభుత్వ తీరును ఎండగడుతూ కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ఆదోనిలో నిర్వహించి ఏడాది పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో ఇరు వర్గాలు ఎవరికి వారే కార్యక్రమాలను గురువారం ఎంతో అట్టహాసంగా కొనసాగించారు.కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి నీలకంతప్ప ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ నుంచి కోట్ల విజయభాస్కర్ రెడ్డి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి నీలకంతప్ప మాట్లాడుతూ దేశంలో ఉన్న రాష్ట్రాల ప్రజలు ఒక్కటేనని భారత్ డోలాయత్ర చాటు చెప్పిందన్నారు. జోడో యాత్ర ప్రజలలో ఎంతగానో ఆకట్టుకుందని గుర్తు చేశారు. దేశంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ అన్ని వర్గాల మహిళలకు రక్షణ కరువైందని వాపోయారు. భారత్ జోదయాత్ర ఫలితంగానే కర్ణాటక హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిందని ఇదే తరహాలో త్వరలో జరగబోయేది 5రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు కూడా కాంగ్రెస్ వైపే మొగ్గ చూపుతున్నాయని ఆశ వ్యక్తం చేశారు.మైనార్టీ జిల్లా అధ్యక్షుడు ఎండి నూర్ అహ్మద్ ఆధ్వర్యంలో చిన్న మార్కెట్ నుంచి గవర్నమెంట్ మహిళల ఆసుపత్రి వరకు పాదయాత్ర చేపట్టారు.అనంతరం జీవనజ్యోతి ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు అనాధ పిల్లలకు ఉచిత భోజనా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఎండి నూర్ అహ్మద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అన్న విషయాన్ని ఐదు కోట్ల ఆంధ్రులకు తెలుసునని బిజెపి ఎన్ని బూటకపు మాటలు చెప్పినా ప్రజలు నమ్మే ప్రసక్తి లేదని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్నదే 140 కోట్ల భారతీయ ప్రజల ఆకాంక్షని అభిప్రాయ వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో దిలీప్ తోక,మారుతి రావు,దేవిశెట్టి వీరేష్,సాయినాథ్, మాణిక్యరాజు,వసి భాష,సయ్యద్ ఖాదిరి భాష,ఎజాజ్ అహ్మద్,తాయన్న,అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకుందాం

విశాలాంధ్ర - కోసిగి : ప్రజాస్వామ్యాన్ని రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవాలని సైకో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక దుర్గ నగర్ లో 8వ వార్డులోని ప్రతి ఇంటికి తిరుగుతూ బాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ మండల కన్వీనర్ జ్ఞానేష్ అధ్యక్షతన , మంత్రాలయం టిడిపి ఇన్చార్జ్ తిక్కారెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులువక్రాని. వెంకటేశ్వర్లు, కొండగేరి.వీరారెడ్డి , దుబ్బ.వీరారెడ్డి, రంగడు,మహాదేవ ,మారెప్ప,డీలర్.నరసన్న , బెళగల్.గోపాల్ , ఆయా గ్రామాల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కారుమంచిలో జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర- ఆస్పరి : మండల పరిధిలోని కారుమంచి గ్రామం లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గురువారం సర్పంచు లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప ఎంపీపీ శంకరమ్మ, మండల నాయకులు కౌలిట్ల,రాజన్నగౌడ్,డిప్యూటీ డీఎంహెచ్ఓ రఘురామి రెడ్డి పాల్గొని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు జగనన్న ఆరోగ్య సురక్షలో పేదలకు ఉచితంగా అందిస్తున్న వైద్య ఆరోగ్య సేవలను గూర్చి వివరించారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్య ఆరోగ్య శిబిరాన్ని, ఐసిడిఎస్ అంగన్వాడి ద్వారా గర్భిణీ, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం వంటకాలను పరిశీలించారు.ఎంపీడీవో రాధమ్మ, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీలు వాలంటరీలు పాల్గొన్నారు.

చంద్రబాబు విడుదల కావాలని పాదయాత్ర

విశాలాంధ్ర - కౌతాళం: టిడిపి జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ కేసుల మాండ్ నుండి ఆరోగ్యంగా విడుదల కావాలని ఆదోని, మంత్రాలయం, నియోజకవర్గాల ఇంచార్జ్ లు మీనాక్షి నాయుడు, తిక్క రెడ్డి, ఉమాపతి నాయుడు, శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఉరుకుంద ఈరన్న దేవాలయం వరకు పాదయాత్ర చేసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మా నాయకుడు క్రమ కేసుల నుండి ఆరోగ్యంగా విడుదల కావాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అడిగొప్పగౌడ్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటపతి రాజు క్లస్టర్ ఇంచార్జ్ కొటేష్ గౌడ్ , మండల, గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుకు న్యాయం కావాలంటూ బిక్షాటన

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా కర్నూల్లో టిడిపి నేతలు వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. నియోజకవర్గ టిడిపి ఇంచార్జి టి.జి భరత్ ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయం ఎదుట బిక్షాటన చేపట్టారు.రోడ్డుపై నిలబడి చంద్రబాబుకు న్యాయం కావాలంటూ బిక్షం ఎత్తుకున్నారు.అటు వైపుగా వెళ్తున్న వాహనదారుల తో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అన్యాయంగా అరెస్టయ్యారని చెప్పారు. ఆయనకున్యాయం కావాలని తాము కోరుతున్నామన్నారు. రాజకీయంగా ఆయన్ను ఎదుర్కోలేకనే కేసులతో ఇబ్బందులు పెడుతున్నారని టీడీపీ నేతలు అన్నారు. ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు నాగరాజు యాదవ్, అబ్బాస్, ముంతాజ్, సత్రం రామక్రిష్ణుడు, ఈశ్వర్, రాజశేఖర్ యాదవ్, మోహన్, శ్రీనివాసులు, రమీజ్, సుందరరాజ్,తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మారణం

విశాలాంధ్ర - దేవనకొండ : బస్సు దాటబోయి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం గుర్తించకపోవడంతో అతివేగంతో వస్తున్నా బోలోరా వాహనం ఢీ కొనడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాల మేరకు గోనెగండ్ల కి చెందిన దుబ్బ. మాబు సాహెబ్ (64) ఇబ్రహీం (42) ఇద్దరు దేవనకొండలో పని చూసుకొని ఈదుల దేవరబండ మీదుగా గోనెగండ్లకు వెళ్తుండగా, కర్నూలు నుండి ఆదోనికి వెళ్తున్న బోలోరే వాహనం కప్పట్రాళ్ల-ఈదుల దేవరబండ గ్రామాల మధ్యలో ఢీ కొనడంతో ప్రమాదంలో ఇద్దరు అక్కడిక్కడే మృతి చెందడం జరిగింది. ముందు వెళ్తున్న బస్సునిఅతి వేగంతోక్రాస్ చేసి ఎదురుగా ద్విచక్ర వాహనం గుర్తించకపోవడంతో ప్రమాదం తీవ్రత వల్ల ఇద్దరు వ్యక్తులు పది అడుగులు పైగానే ఎగిరిపోయి పడినట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాక్షేత్రంలో జగన్ ను దోషిగా నిలబెడతాం

విశాలాంధ్ర - పత్తికొండ : చంద్రబాబు అక్రమ అరెస్టును ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రజలకు తెలియజేసి ప్రజాక్షేత్రంలో జగన్ ను దోషిగా నిలబెడతామని తెదేపా నియోజకవర్గ ఇంచార్జి కే.ఈ. శ్యాంబాబు అన్నారు. గురువారం పత్తికొండ పట్టణంలోని 17వ వార్డులో మాజీ వార్డ్ మెంబర్ గిరిపోగు హరినాథ్ అధ్యక్షతన ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్యాంబాబు మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబును అక్రమంగా కేసులో ఇరికించి జగన్మోహన్ రెడ్డి పైశాచిక ఆనందం పొందుతున్నారని తెలిపారు.బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ పథకాలతో ప్రజాక్షేత్రంలోకి వస్తున్న బాబుకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఓర్వలేక కేసులో ఇరికించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల యువత అధ్యక్షుడు శ్రీకాంత్ చౌదరి,శ్రీనివాస గౌడ్,ఉచ్చురప్ప,బీటీ గోవిందు,మీరా హుస్సేన్,రవి,తదితరులు పాల్గొన్నారు.

హనుమప్ప మృతి తీరని లోటు... కె.రామకృష్ణ

విశాలాంధ్ర - పత్తికొండ : మద్దికేర మండల సీపీఐ నాయకులు హనుమప్ప మృతి సీపీఐకి తీరనిలోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. హనుమప్ప గత కొంతకాలంగా అనారోగ్యం బారిన పడి కర్నూల్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువా రం కోలుకోలేక మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, డి.జగదీష్, సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి పి.భీమ లింగప్ప లతో కలిసి హనుమప్ప మృతదేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రామకృష్ణ మాట్లాడుతూ హనుమప్ప సిపిఐ మద్దికేర మండల కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేసి, మద్దికేరలో పార్టీ అభివృద్ధికి కృషి చేశారన్నారు. కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులుగా, ఏపీ రైతు సంఘం జిల్లా ఆఫీస్ బేరర్‌గా పనిచేశారని గుర్తు చేసుకున్నారు.హనుమప్ప ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబి రసూల్, మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, గురుదాస్, మద్దిలేటి శెట్టి, కారుమంచి, ఉన్నారు.

నేడు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ రాక

విశాలాంధ్ర - ఆలూరు : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ శుక్రవారం ఆలూరు పట్టణానికి వస్తున్నట్లు సీపీఐ మండల కార్యదర్శి రామాంజనేయులు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మొలగవల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన కళ్యాణ మండపం ప్రారంభోత్సవములో ఉదయం 8 గంటలకు పాల్గొంటారని తెలిపారు. అనంతరం మండల పరిధిలోని అతివృష్టి కారణంగా పంటలు వేసి నష్టపోయిన పంటపొలాలను రైతులతో కలిసి పరిశీలించడం జరుగుతుందన్నారు. పంట పొలాల పరిశీలన కార్యక్రమంలో సీపీఐ నాయకులు,కార్యకర్తలు,ప్రజా సంఘాలనాయకులు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రామాంజనేయులు కోరారు.

నేడు సీపీఐ పంటల పరిశీలన

విశాలాంధ్ర - కర్నూలు : జిల్లాలో తీవ్ర వర్షా బావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్ సీజన్లో రైతులు వేసిన ప్రధాన పంటలు దెబ్బతిని, ఎండిపోవడంతో తీవ్రంగా నష్టం జరిగింది. జిల్లా వ్యాప్తంగా కరువు విలయతాండవం చేస్తున్న నేపథ్యంలో సీపీఐ రాష్ట్ర బృందం జిల్లాలో పశ్చిమ ప్రాంతంలో అక్టోబర్ 20న ఆలూరు,ఆదోని,మండలాల్లో పంటలను పరిశీలన చేయడానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు పి.రామచంద్రయ్య,డి.జగదీష్ పర్యటిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య తెలిపారు. ఈ పర్యటనలో రైతులను స్వయంగా కలుసుకొని వారి కష్టాలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టే విధంగా, పంట వేసి నష్టపోయిన ప్రతి రైతుకు పంట నష్ట పరిహారం ఇచ్చే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి చేయడం జరుగుతుందని తెలిపారు.

ఓపెన్ స్కూల్స్ ప్రవేశాల గడువు పొడిగింపు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా 2023-24 విద్యా సంవత్సరమునకు సంబంధించి 10వ తరగతి మరియు ఇంటర్మీడియట్ తరగతులలో అడ్మిషన్ పొందడానికి ఎటువంటి ఆలస్య రుసుము లేకుండా అక్టోబర్ 31వ తారీకు వరకు ఆంధ్రప్రదేశ్ విద్యాపీఠము సంచాలకులు పొడిగిస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. 14 సంవత్సరములు నిండిన వారు ఎవరైనా 10వ తరగతి నందు,15 సంవత్సరములు నిండి 10వ తరగతి పాసైనవారు ఇంటర్మీడియట్ నందు అడ్మిషన్ పొంది ఒక్క సంవత్సరం లోనే ఇంటర్మీడియట్ పూర్తి చేసుకొనవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రంగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమాచారము కొరకు www.apopenschool.ap.gov.in వెబ్ సైట్ ను లేదా మీకు సమీపంలోని ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ లేదా ప్రభుత్వ పరిక్షల సహాయ కమీషనరు,జిల్లా విద్యాశాఖ కార్యాలయము, కర్నూలు వారిని సంప్రదించవలసినదిగా పేర్కొన్నారు.అర్హత ఆసక్తి ఉన్న అభ్యాసకులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీపీఐ..జగన్మోహన్ రెడ్డికి బహిరంగ లేఖ

విశాలాంధ్ర -ఆదోని రూరల్ : జిల్లాను జిల్లాగా ప్రకటించాలని సీపీఐ ఆధ్వర్యంలో పట్టణ,మండల కార్యదర్శిలో సుదర్శన్, కల్లుబావిరాజుల సమక్షంలో బహిరంగ లేఖను విడుదల చేశారు.ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతు లకు కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమ ంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వెంకన్న,వైటి భీమేష్, షేక్షావలి, ఎల్లప్ప,బోయ ప్రకాష్ తదితరులు ఉన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పర్యటనను జయప్రదం చేయండి.ఈఏడాది వర్షాలు లేక ఎండిపోయిన పంట సాగును పరిశీలించేందుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ శుక్రవారం మండలంలోని నారాయణ పురం,దానాపురం గ్రామాలలో పంట పొలాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.ఆయనతోపాటు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచం ద్రయ్య,డి.జగదీష్ విచ్చేస్తున్నట్లు తెలియజేశారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

విశాలాంధ్ర - వెల్దుర్తి రూరల్ : మండల పరిధిలోని ఎస్.పేరెముల గ్రామానికి చెందిన బొమ్మాజి బాలకృష్ణ (45) అనే వ్యక్తి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి నందుచికిత్స పొందుతూ గురువారం మృతి చెందిన సంఘటనచోటుచేసుకుంది.వివరాలలోకి వెళితే ఎస్.పెరేముల గ్రామానికి చెందిన బొమ్మాజీ బాలకృష్ణ బుధవారం చోటుచేసుకున్న కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురై పురుగుల మంద,యు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు.దీంతో కుటుంబ సభ్యులు కర్నూలుప్రభుత్వ ఆసుపత్రికి తరలించి,అక్కడచికిత్స అందించారు.అయితే గురువారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం.